# విరిగిన కెరటం

పోలీసు తాణాలో గంటకొట్టడానికి యింకొక్క క్షణం వుండగా రామం కెమేరాలు రెండూ బల్లమీదపెట్టి కిటికీ తలుపు తెరిచాడు. చల్లటిగాలితోబాటు దూరంనుంచి లతా మంగేష్కర్ కంఠం.

“ఓ సజనా ! బరఖా బహార్ ఆయీ” అని వినిపించింది, రామం మనస్సులోంచి ఒక నిట్టూర్పు వచ్చింది.

“బరఖా బహార్ ఆయీ !” నిజమే వసంతమొచ్చింది. తాణాలో పదిగంటలు కొట్టారు పాట ముగిసింది. శబ్దం నిలిచింది. ఈ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ....

“రాంబాబుగారు !” అంటు పిలుపు వినిపించింది.

“వస్తున్నా రంగా !” అని రామం రెండు కెమేరాలు, ఫ్లాష్‌గన్ తీసుకొని బయలుదేరాడు. అరమైలుదూరం నడచి ఒక యింటికి చేరాడు. ఆయింట్లో ఏదో శుభకార్యమని చెప్పకుండానే తెలుస్తోంది. రామాన్ని చూడగానే ఇతని వయస్సు కుర్రవాడు.

“ఏం ? మొగపెళ్ళివారిమని అనుకుంటున్నావా ?” అని అడిగాడు.

“యింకా వ్యవధి వుందిగా !”

“కబుర్లకేంగాని పని మొదలుపెట్టు. ముహూర్తం పన్నెండుగంటలకని శుభలేఖలో వేశాం. తమరు మరచిపోయి వుంటారు, శ్యాం లోపల గౌరీపూజ చేసుకుంటోంది. దయచేయండి.”

రామం ఏం మాట్లాడలేదు. కెమేరా ఒక్కసారి చూసుకొని లోపలికి బయలుదేరాడు. సావిడిగుమ్మం దగ్గర యాభై సంవత్సరాల వ్యక్తి ఇతన్ని చూసి....

“రామం !”

“ఫొటోలు తియ్యడానికి వచ్చానండి.” అని రామం అన్నాడు,

రామంచేతిని తనచేతిలోకి తీసుకుని “ఈ ముసలివాడి మాటలకు మనస్సు కష్టపెట్టుకోకు నాయనా, మరిచిపో !” అం ఆయన అన్నాడు.

రామం ఏమీ సమాధానం యివ్వకుండా సరాసరి లోపలికి వెళ్ళాడు. దేముడిగదిలో పెళ్ళికూతురు గౌరీపూజచేస్తోంది. రవ్వంత దూరంగా గోడకు ఆనుకుని, ఒక పండు ముదుసలి ముత్తైదువ, గడచిన గాధలేవో మనస్సున మననం చేసుకుంటూ ఏదో లోకంలోవుంది. గదిలోఒక్కసారి గప్పున

రచన:

మల్లాది సూరిబాబు

ఫ్లాష్‌బల్బు వెలిగింది. ఉలిక్కిపడి పెళ్ళికూతురు యిటు చూసింది. రామం యీ వంకచూడకుండా యింకొక ఫోటో తీసే ప్రయత్నంలో వున్నాడు.

“రా మం !!!”

“నన్ను సర్వ హక్కులతో యిచ్చేస్తున్నారు రామం !” అంటూ ఆపిల్ల ముఖాన్ని రెండుచేతులతో కప్పుకుంది. చేతుల్లో వున్న అక్షింతలు కన్నీటిలో కలిసి జల జలా రాలాయి. ఆలోచనలలో వున్న ముత్తైదువ వులిక్కిపడి వీళ్ళిద్దరివంకా చూసి....

“ఏమిటే అమ్మాయి ?” అని అడిగింది.

ప్రచురణకు స్వీకరించిన

పోటీ కథానిక

“ఏం లేదు మామ్మా ! కంట్లో నలక పడ్డది” అని పెళ్ళికూతురు సమాధానం యిచ్చింది.

అక్కడనుంచి రామం పెళ్ళిపందిట్లోకి వచ్చాడు. మొగపెళ్ళివారి భజంత్రీల శబ్దం వినిపించింది. ముందు బ్యాండు మేళం వెనక టాపులేని కారులో, పెళ్ళికొడుకు. కారు దిగి అతను లోపలికి వస్తుంటే ఆడపెళ్ళివారి తాలూకూ ఆడవాళ్లు.

“అచ్చంగా దొరలాగా వున్నాడే.

కట్టరంటే అల్లా వుండాలి” అని అనుకున్నారు.

పెళ్ళి కొడుక్కి ఫొటో తియ్యడం కోసం రామం. రిఫ్లెక్సు కెమెరా వ్యూఫైండరులో చూస్తూ ఒక్కొక్క అడుగే వెనక్కి వెయ్యడం మొదలు పెట్టాడు. కాలికేదో తగిలింది. చూస్తే అది పెళ్ళికొడుకు కోసం వేసిన ఎత్తుపీట. రామం అక్కడే ఆగి, పెళ్ళి కొడుక్కి అతని బృందానికి ఫొటో తీశాడు. పెళ్ళికొడుకు యితని వంక చూసి, ‘థ్యాంక్యూ!’ అని అన్నాడు.

పురోహితుడు చకచకా మంత్రాలు చదువుతూ, మధ్యలో “పెళ్ళికుమార్తెను తీసుకురండి.... అని అనగానే, ప్రక్కన యిద్దరు ముత్తైదువులు, మేనమామ వెంట రాగా, వడిలో కొబ్బరి బొండాం పెట్టుకుని పెళ్ళికుమార్తె యిటు నడిచి వస్తోంది. ఆ మనిషిని చూసి మొగపెళ్ళి వారంతా.

“మనవాడు చాలా అదృష్టవంతుడు” అని అనుకున్నారు.

పెళ్ళి కుమార్తె, తల్లి ప్రక్కన కూర్చోబోతూంటే, ఫ్లాష్ బల్బు వెలిగింది పెళ్ళికూతురు ఒక లిప్తకాలం యితని వంక చూసి, తల వంచుకుంది. పెదిమలు కదల్లేదు కాని, కళ్లమాత్రం.

“నన్నింకా చిత్రవధ చేస్తావు దేనికి ?” అని అంటున్నాయి. హృదయాన్ని వెయ్యి వ్రక్కలు చేస్తూ రామం గుండెల్లోంచి ఒక నిట్టూర్పు వెలువడింది.

